శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!!

సద్గురు సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!

# గురుకృప

గురో పినతీ మీ కరీ హృదయ మందిరీ యా బసా!
సమస్త జగవే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహీదే జగత్పావనా!



ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలిచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కల్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి:2 సంచిక:7 త్రైమాసిక పత్రిక జూన్ - 1999

# సాయివంటి దైవంబు లేడోయి లేడోయి

## ప్రజలందరి నోట సాయి నామం పలకాలి! సర్వత్రా సాయి రూపం రంజిల్లాలి!

ముజ్జగాలు సాయి మహిమతో
ముప్పిరి గొనాలి! సాయిపద
రవళులు మన హృదయ
కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద
వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి!



ఆ సుజ్ఞాన సౌరభాల
ఆస్వాదనలో మన మనసులు
మత్తెక్కాలి! సాయి
ప్రేమామృతధారలు అంతటా
నిరంతరం వర్షించాలి! ఆ
ప్రేమామృత ధారలలో
తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల
మత్తులో ఆనందంగా నర్తిస్తూ

సద్గురు
శ్రీ సాయినాథుని శరద్బాబూజీ

'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి! అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

*********************************************************************************

## ఈ సంచికలో



| | | |
|---|---|---|
| 1. | సాయివంటి దైవంబులేడోయి!లేడోయి | |
| 2. | ఉన్నమాట - అనుకున్నమాట - | గురు బంధువులు |
| 3. | కావవి అడ్డుగోడలు - క్షేమంగా దరి చేర్చు ఒడలు | డా॥సాయినాథుని శరద్బాబూజీ (సాయిపథం నుండి) |
| 4. | వాస్తవానికి పోయేది ఉద్యోగం ఉందికదా! గురుదేవుల అనుగ్రహం | ఇనగంటి రత్నకుమారి |
| 5. | దేవతా స్వరూపులు మా గురువుగారు | పి.వరలక్ష్మి |
| 6. | ఊహించని రీతిలో అనుగ్రహించిన గురూజీ | జి. భార్గవి |
| 7. | బాబా చేతి ఊది - గురూజీ నోటి మాట | పి. లక్ష్మీనారాయణ |
| 8. | సద్గురు అనుగ్రహంతో సత్సంగ మందిరము | A.R.R. మోహనరావు |
| 9. | బాబా ఉంటే చాలు వేరేల ముక్తి మోక్షాలు | డా॥జి. సాయివరప్రసాదరావు |
| 10. | శరణాగతి సులభమా? కష్టమా? | S.V.L. నారాయణరావు |
| 11. | సాయిపథం వారి బాట విద్యాపథం వారి మనోభావానికి ఒక పిత్తు | సేకరణ : గురుకృప |

## ఉన్నమాట - అనుకున్నమాట

నేడు అనేక మంది గురుబంధువులు సాయిపథంలోకి వచ్చి, గురూజీ మార్గదర్శకంలో సాయితత్త్వం గ్రహించి సాయిపథ సాధకులుగా పరిణితి చెందటానికి పరితపిస్తున్నారు. ఈ తరుణంలో మన చుట్టు ప్రక్కల సమాజం నుండి మనకు ఎదురయ్యే ప్రశ్న "మనిషిని ఆరాధించడం ఏమిటి?" అని. సర్వసామాన్యమైన ఈ సమస్యకు సమాధానమే మన గురూజీ వ్రాసిన "కావవి అడ్డుగోడలు - క్షేమంగా దరిచేర్చు ఓడలు" అనే ఈ సంచికలోని వ్యాసం.

"గురువు పట్ల మన ఆరాధన ఎలా ఉండాలి? శరణాగతి అంటే ఏమిటి?" మొదలైన ప్రశ్నలకు సమాధానాలు, అంతటి మహాత్ముడు బాబా "ఈనాటి స్థితికి మూలము నా గురువే" అని నొక్కి చెప్పిన సందర్భాన్ని ఆ చేయి ఎంత హాయి 5వ భాగంలో చదివితే దొరుకుతాయి.

గత ఐదారు నెలలలో అనేక చోట్ల మన సత్సంగ కేంద్రాలలో జరిగిన వార్షికోత్సవాల నేపథ్యాలను, తీరు తెన్నులను పరిశీలిస్తే అవన్నీ ఒక తంతులాగా జరుగుతున్నాయేగానీ, గురువుగారి అంతరంగాన్ని అనుసరించి నిర్వహింపబడుటలేదనిపిస్తోంది. ఆయా వార్షికోత్సవాల్లో డెకరేషన్లు, భోజనాలు, ఊరేగింపులు ఇత్యాది కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇవ్వబడుతోంది. గురూజీ కోరిన ప్రకారము "గత సంవత్సర కాలములో మనం జరుపుకున్న కార్యక్రమాలు, సత్సంగాల సింహావలోకనం" అనే అసలు విషయం అప్రధానమై పోతుంది. నలుగురిని పిలిచి చేసుకునే పేరంటాలు, విందు భోజనాలే తప్ప గత కార్యక్రమాల మంచిచెడుల సమాచారాన్ని గురుబంధువులకు అందించే ప్రధాన విషయం మరుగున పడిపోతోంది. మన అవగాహనాపరిధి విస్తరించనందువల్ల జరిగే లోపాలే ఇవి. ఇకనైనా వాటిని దాటి గురుజీ బాటలో పయనించటానికి ప్రయత్నిద్దాం.



"ప్రతి ప్రయత్నం బాబాది-గురువు గారిదే! మనదేమీ లేదు అని అంటూ ఉంటారు. "అన్ని పనులలో అలాగే బాబాపట్ల, గురువు పట్ల శరణాగతి చెందుతున్నామా" - అని ఆత్మవిమర్శచేసుకుంటూ, గురుజీ మార్గాన్ని అన్వేషిస్తూ, అర్థం చేసుకుంటూ, అనుసరిద్దాం.

-గురుబంధువులు

## కావవి అడ్డుగోడలు- క్షేమంగ దరిచేర్చు ఓడలు

(జూలై 94 సాయిపథం నుండి)

మహాత్ముల,పరిపూర్ణ సిద్ధ పురుషుల చరిత్రలు చదవటం ఆధ్యాత్మికతకు ఎంత అవసరమో మన రాష్ట్రానికి, ఇతర రాష్ట్రాలకు వున్న భేదం చూస్తే తెలుస్తుంది. ఇతర రాష్ట్రాలలో దైవాన్ని అర్చించటంతో పాటు భక్తులను పూజించడం, వారి చరిత్రలు పారాయణ చేయడం వున్నది. తమిళదేశంలో శైవసిద్ధుల చరిత్ర 'పెరియపురాణం' అన్న గ్రంథాన్ని పారాయణద్వారా భక్తులు స్మరిస్తారు. ఆధ్యాత్మిక పరిజ్ఞానమేమీ లేని బాలుడు - వెంకట్రామన్ -- భగవాన్ శ్రీ రమణమహర్షిగా రూపొందడంలో పెరియపురాణం వహించిన పాత్ర ఆయన చరిత్ర చదివితే తెలుస్తుంది. మహారాష్ట్ర దేశంలో "శ్రీగురుచరిత్ర" మొ||న దత్తావతారాల చరిత్రలతో బాటు తుకారాం, జ్ఞానేశ్వర్, నామదేవ్ మొ|| భక్తుల చరిత్రలుగల 'శ్రీ పాండురంగ భక్త విజయం' మొ|| భాగవతుల చరిత్రలు పారాయణ చేయడం యీ నాటికీ ఆచారం, ఉత్తర భారతదేశంలో రామకృష్ణాది మూర్తుల నర్చించడంతో బాటు కబీరు,

తులసీదాసు, మీరా మొదలైన భక్తులను ఆరాధించడం కూడా చూడవచ్చు. ఈ విధంగా భాగవతుల నారాధించే సాంప్రదాయం ఆంధ్రదేశంలోనే అంతగా కనిపించదు. అందుకే ఆధ్యాత్మికత మిగిలిన రాష్ట్రాలలో కంటే తక్కువగా కనిపిస్తుంది ఆంధ్రదేశంలో.

భక్తి, ఆధ్యాత్మికతలకు మూల స్తంభాలు మూడు, - భగవంతుడు, భాగవతము, భాగవతుడు. పూర్ణ భగవత్ తత్త్వం భక్తి జ్ఞానాలు పరిపూర్ణమయ్యాకగాని అనుభూతం కాదు. అలా మనం పరిపూర్ణత పొందేలోగా ఆ దైవం యొక్క ఆస్తిక్యత మనకు సంశయాస్పదంగా వుంటూ మనస్సు భక్తిలో నిలువక నిరుత్సాహానికి, అవిశ్వాసానికి దారితీస్తాయి. దైవం గురించి ఆయన తత్త్వాన్ని గురించి ఆయనను పొందే మార్గాల గురించి, అలా పొందిన మహాత్ముల గురించి తెలిపేదే భాగవతము. ఈనాటి సాంఘిక పరిస్థితులదృష్ట్యా భాగవతాన్ని గూడా విశ్వాసంతో చదివి ఆచరించలేము. ఏమో! అదంతా కట్టుకథలేమో! ఆత్మవంచనేమో! అన్న సంశయం పొడసూపక మానదు. ఒకవేళ సందేహం కలుగక పోయినా కలిగించేవారికి తక్కువలేదు. ఈ పరిస్థితుల్లో భాగవతుడొక్కడే భక్తుల భక్తికి ఆధారం. భాగవతుడంటే భాగవతంలో చెప్పినదాన్ని ఆచరించి పరిపూర్ణుడై భగవదనుభూతిని పొందిన శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ రమణ మహర్షి వంటివారు. వీరి నుండి వ్యక్తమయ్యే భగవద్విభూతి, మహత్వమే సామాన్య ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రాతిపదిక.

రాముడు, కృష్ణుడు, ఏసు, బుద్ధుడు, మొ|| వారంతా మానవ రూపంలోనే ఈ భూమిమీద సంచరించారన్న విషయం మరచి, వారిని పూజించేవారూ, మహాత్ములను ఆరాధించడాన్ని "మానవమాత్రులను పూజించేదేమిటి?" అయినా మనకూ భగవంతునికి మధ్య మధ్యవర్తులెందుకు? అని ఎద్దేవ చేయటం కేవలం అజ్ఞానం. భగవంతునికీ - భక్తునికీ, మధ్యవర్తించే వారధి, వాహనము భాగవతుడు (గురువు). ఆయన మార్గదర్శి, మార్గము. కొంచెం సూక్ష్మంగా పరికిస్తే గమ్యం కూడా తానే మార్గమని, తనద్వారాతప్ప భగవంతుణ్ణి ఎవరూ చేరలేరని అన్న సద్గురుమూర్తి ఏసు వాక్యాలకర్థం యిదే.

## వాస్తవానికి పోయేది ఉద్యోగం - ఉందికదా! గురుదేవుల అనుగ్రహం

*గురుదేవులు డా॥సాయినాథుని శరత్ బాబూజీ కరుణామృత దృష్టిచే పోయిన ఫైల్సు తిరిగి దొరుకుట*

అది 1993 సం|| ఆగష్టు 12వ తేదీన జరిగిన యదార్థ సంఘటన. మావారు గుత్తి వెంకటప్పయ్య చౌదరి తెనాలి సబ్ కోర్టులో బెంచి క్లర్కుగా జాబు చేయుచున్నారు. తోటిక్లర్కు సెలవు పెట్టినందున, మా వారికి అతను చేయుచున్న సీటు కూడా అప్పగించుటచే పనిభారము ఎక్కువగా ఉన్నందున రోజు యింటికి వచ్చునప్పుడు కూడా ఫైల్సు తెచ్చుకుని, పూర్తి చేసుకొని మరల తీసుకొని వెళ్ళేవారు. 12వ తేదీ రాత్రి 8.00గంటల సమయములో పెద్ద సంచి నిండా కోర్టుకు సంబంధించిన ముఖ్యమైన సమన్లు, మరియు డాక్యుమెంట్సు, ఇతరత్రా పెట్టుకొని ఆ సంచిని స్కూటరు కాళ్ళవద్ద వున్న హుక్ కు తగిలించుకుని ఇంటికి వచ్చు సమయమున సంచికి వున్న రెండూ హ్యాండిల్స్ లో ఒక హ్యాండిల్ తెగిపోయి రోడ్డు మీద పడిపోయినది. ఈ విషయం ముందుగా మా వారికి తెలియదు. మావారు కోర్టు నుండి బజారులో పని వున్నందున బజారులో పార్కు వద్ద స్కూటరు ఆపి సంచిని తీసుకొనపోగా సంచి కనపడలేదు. వారు పొరపాటున దారి మధ్యలో ఏమైనా పడిపోయినదేమోనని వచ్చిన దారి గుండా చూచుకుంటూ మరల కోర్టువద్దకు వెళ్ళినారు. ఎక్కడా కనిపించలేదు. వారి బాధ వర్ణనాతీతము. ఈ విషయమును షిరిడీలోని గురుదేవులు శరత్ బాబూజీ గార్కి 14వ తేది రాత్రి ఫోనులో విన్నవించగా వారు "బాధపడవద్దు. బాబా ఉన్నారు. ఏమీ భయపడవద్దు" అని ఎంతో ఓదార్పుగా చెప్పినారు. కాని మాకు బాధగానే వున్నది. సంచి పోయిన విషయము మావారు బజారులో వున్న షాపుల యజమానులకు, తెలిసిన వారికి చెప్పి ఎవరికైనా విషయము తెలిసిన తనకు సమాచారము చెప్పవలసినదిగా కోరినారు. గురుదేవులకు ఫోనుచేసి ఈ విషయమును గూర్చి చెప్పి వారం

రోజులైనను సంచిని గూర్చి ఆచూకీ కనపడలేదు. వారికి చెప్పిన వారం రోజుల తర్వాత ఆ సంచిని గురించిన విషయము బయటకు వచ్చినది. ఆ సంచి రోడ్డు మధ్యలో పడినందున వెనుక నుండి వచ్చు రిక్షా అతను సంచి పడిపోవుట చూచి తీసుకుని వెళ్ళినాడు. ఆ విషయమును రిక్షా అతను కిళ్ళీ కొట్టు యజమానితో కోర్టుకు సంబంధించిన ఫైల్సుగల సంచి దొరికినట్లు అది తన ఇంట్లో దాచినట్టు చెప్పినాడట. కిళ్ళీ కొట్టు యజమాని ఆ సంచి కోర్టులో పనిచేసే క్లర్కుది పోయినట్లుగా, ఎవరికైనా దొరికితే సమాచారము తెలియచేయమని ఆ క్లర్కు తనకు చెప్పినట్లుగా రిక్షా అతనితో చెప్పగా అతను నేను రేపు తెచ్చి యిస్తానని చెప్పుటచే, కిళ్ళీషాపు యజమాని రేపు తెచ్చి యిస్తానని చెప్పినందున అతని పేరుగాని, అడ్రసుగాని తెలుసుకొనలేదు. కాని రిక్షా అతను చెప్పిన దగ్గర నుండి అసలు కొట్టుకు కూడా రానట్లు తెలిసినది. మా బాధ మరీ ఎక్కువైనది. రిక్షా అతను కనపడలేదు. ఈ విషయము మరల శరత్‌బాబూజీ గార్కి ఫోనులో చెప్పి, ఆ సంచి దొరికేలాగ అనుగ్రహించవలసినదిగా వేడుకొనినాను. వారు మరల మాకు ధైర్యం చెప్పి "ఏమి భయపడవద్దు, బాబా ఉన్నారు" అని చెప్పినారు. మాకు మాత్రం రోజురోజుకి భయాందోళనలు ఎక్కువైనవి. కోర్టు జడ్జిగారు మావారు చేసే ఆఫీసుపని ఎక్కువ ఉన్నట్లు గ్రహించి ఆ సంచి ఆచూకీ విషయమును తెలిసికొని మెమో యిచ్చినారు. ఆగష్టు నెల 30వ తేది వచ్చినది. అప్పటికి సంచిపోయి 18 రోజులు అయినది. రిక్షా అతను కనపడ లేదు. జడ్జిగారు సంచి దొరకదేమోనని అనుకున్నారో ఏమో నీకు రేపు ఒక్కరోజు గడువు ఇస్తున్నాను, రేపు దొరకనిచో జిల్లా జడ్జిగారికి నీ మీద రిపోర్టు వ్రాస్తాను అని చాలా గట్టిగా వార్నింగు ఇచ్చినారు. మావారు ఈ విషయమును ఇంటికి వచ్చి బాధతో చెప్పగా, గురుదేవుల మీద, బాబా మీద వున్న అపారమైన ప్రేమ, నమ్మకముతో నేను వారి ఫోటో ముందు ఏడుస్తూ, ఈ రోజు ఆఖరిరోజు. నా భర్త వట్టి చేతులతో యింటికి తిరిగి రాకూడదు. ఎట్టి పరిస్థితులలోను వారికి సంచి దొరికేలా చేయండి అని ఏడుస్తూ ప్రార్థించుచున్నాను. ఈ లోపు మావారు స్టేషను వద్దకు వెళ్ళి రిక్షావాళ్ళతో, నా సంచి పోయినది, ఒక రిక్షా అతనికి దొరికినట్లు తెలిసినది. కాని అతను ఇంతవరకు కనపడలేదు. కాస్త మీరు విచారించి నా సంచి ఇచ్చిన నేను సంతోషంగా వందరూపాయలు ఇస్తాను అని చెప్పుచుండగనే ఆ సంచి దొరికిన రిక్షా అతను వెంటనే ఆ సంచి నాకు దొరికినది అని చెప్పి వాళ్ళయింటికి మా వారిని రిక్షాలో తీసుకునివెళ్ళి సంచి భద్రంగా తెచ్చి యిచ్చినాడు. ఆ సంచిని తీసుకుని మావారు ఎంతో సంతోషంతో రాత్రి 10.00 గంటల సమయములో ఇంటికి వచ్చినారు. ఈ విషయమును వెంటనే గురూజీకి ఫోనులో(షిరిడీకి) చెప్పగా, వారు ఎంతో ఆప్యాయతగా మాకు దీవెనలు అందచేసినారు. ఆ రాత్రి ఆనందంతో హాయిగా నిద్రపోయినాము. కోర్టు జడ్జిగారు మరియు తోటి సహోద్యోగులు పోయిన ఫైల్సు దొరకటం ఎంతో గొప్ప విషయం. ఇంతవరకు పోయినవి దొరకలేదు అని చాలా సంతోషించి మా వారిని అభినందించినారు. ఫైల్సు పోయి దొరకటం శరత్‌బాబూజీ గారి కరుణామృతదృష్టిగాక మరి ఇంకేమిటి? ఆ ఒక్క సంఘటనే కాదు మాకు గురూజీ సాయినాథుని శరత్ బాబుగారు మా వారి ఆరోగ్య విషయంలో కూడా, వారి చేతితో విభూదినిచ్చి, ఎంతో ఆయాసంతో బాధపడుచున్న సమయములో కూడా వారిని రక్షించినారు. ఒకటేమిటి యిలా చెప్పుకుంటూ పోతే ఎన్ని పేజీలయినా చాలవు. ప్రతి క్షణము గురూజీ మా వెంట వుండి ఎంత క్లిష్టసమస్యైనను, ఎన్ని బాధలున్నను, వారిని ప్రార్థించుకుంటూ వారికి ఫోనులో చెప్పగనే మాకు వెంటనే తీర్చుచున్నారు. వారికి మేము ఎంతో ఋణానుబంధులము.

సెప్టెంబరు 93 — ఇనగంటి రత్నకుమారి - చినరావూరు.

## "దేవతా స్వరూపులు మా గురువుగారు"


6-1-1999 రోజు రాత్రి తెల్లవారితే గురువారమనగా నాకొక స్వప్నం వచ్చింది. కానీ నేనీ స్వప్నాన్ని ఎవరికీ చెప్పాలనుకోలేదు. నాకు కలిగిన ఈ స్వప్నానికి 17-1-99న జరిగిన ఫంక్షన్ కీ చాలా దగ్గర సంబంధం వుందనిపించి నేను పొందిన ఆనందాన్ని 10 మందికీ పంచాలన్న కోరికతో గురుకృపకు (వ్రాయాలన్పించే ప్రేరణ గురువుగారిదిగా భావించి) వ్రాస్తున్నాను.

నాకు కలిగిన స్వప్నం, అదొక కొండప్రాంతం, అక్కడ పెద్దకొండ వున్నది. ఈశాన్యంలో ఉత్తరపు వైపున్నదాకొండ. కొండకు ఇవతల కొంచెం పల్లంగా, చదరంగా వున్న ప్రదేశంలో స్త్రీలు, పురుషులు చాలా మంది లైనుగా కూర్చుని వున్నారు. వారికి కాస్తంత ఎత్తైన దాని మీద శ్రీ సాయివరప్రసాదుగారు కూర్చుని సత్సంగం చేస్తున్నారు. అందరూ శ్రీసాయిగారి వంకే చూస్తూ, చాలా శ్రద్ధగా సత్సంగం వింటున్నారు. స్త్రీలు ఉత్తరం వైపు-పురుషులు దక్షిణం వైపు. అందరూ తూర్పువైపు తిరిగి వున్నారు. శ్రీసాయిగారు వారికి ఎదురుగా కూర్చుని విద్యాబోధించే ఉపాధ్యాయునిలా ఎంతో శ్రద్ధగా చెప్తున్నారు. నేను తలవంచుకుని వింటున్నాను (అదేమిటో ఒక్క ముక్కా తెలియటంలేదు) ఆడవాళ్ళకు ఉత్తరంగా కాస్త పరధ్యానంగా కూర్చుని వున్న నేను సడన్‌గా తలయెత్తి శ్రీసాయిగారి వంక చూసాను. ఆయన వెనుక కొండకి ఇవతలగా ఓ ఎత్తైన వెడల్పాటి కొండరాయి మీద గురువుగారు ధ్యానస్థులై కూర్చుని వున్నారు. నాకు ఆశ్చర్యమూ, సంతోషమూ ఒకేసారి కలిగాయి. అప్పుడిలా అనుకున్నాను. ఓహో! గురువుగారు ఇలా కొండప్రాంతాలకు వచ్చి తపస్సు చేసుకుంటారు కాబోలు అని అనుకుని ఆయననే తదేకంగా చూస్తున్నాను. సత్సంగంలో వాళ్ళసంగతి నాకిక తెలియదు. ధ్యానం పూర్తి అయింది కాబోలు గురువుగారు లేచి అక్కడే అటూ ఇటూ తిరుగుతూ వున్నారు. అక్కడ ఒక తెల్లగా సున్నం కొట్టిన మైలురాయి వుంది. దాన్నిండా బూజుపట్టి వుంది. గురువుగారు దాని దగ్గరకెళ్ళి ఒక్కసారిగా పైనుండి క్రిందకి చేత్తో బూజు లాగేశారు. గురువుగారు అక్కడేదో చేత్తో తాకారు కాబట్టి అదేదో పవిత్రమైనది. ఆ తర్వాత నేను వెళ్ళి దాన్ని చూడాలి. అదేంటో? అనుకున్నాను.

గురువుగారు కాస్తదూరంగా ఇటు దక్షిణంవైపుకు రాగానే నేనా ప్రదేశానికి వెళ్ళి ఆ మైలు రాయిని చూస్తే, దాని మీద 'క్రిస్ఠమస్ ఫెస్టివల్' అని వ్రాసుంది. ఓహో! ఇక్కడ క్రిష్టియన్స్ ఫంక్షన్ చేసుకున్నారు కాబోలు అందుకే ఈ ప్రదేశమంతా శుభ్రంగా చేసివుంది అనుకున్నాను. మళ్ళీ గురువుగారు ఎటువున్నారా అని చూసేసరికి నాకెంతో ఆశ్చర్యమనిపించింది. ఎందుకంటే గురువుగారు తమాషాగా వున్నారు. భుజాల వరకు నల్లని నొక్కుల జుత్తు, క్రిందిదాకా అతితెల్లని గౌనులాంటిది, నల్లని చిన్న గడ్డం, బుల్లి బుల్లి మీసాలు, ఇదీ ఆయన వేషం. నాకు అన్పించింది. ఇదేమిటి? గురువుగారు అచ్చం ఏసుక్రీస్తులా కనిపిస్తున్నారు. భుజాల వరకూ అంత జుత్తు ఎప్పుడు పెరిగిందా అనుకున్నాను. ఆయన పచార్లు చేస్తూనే శ్రీసాయి గారి సత్సంగం వింటున్నారు. ఇలా చూస్తూ వుండగానే తల్లోంచి జుట్టుతీసి విసిరి దూరంగా పారేశారు. అప్పుడు అచ్చం మామూలు గురువుగారి జుత్తు, డ్రస్ కూడా మామూలు. ఎలా చేంజ్ అయిందో మామూలు ధోవతి, బనీను, ఉత్తరీయం. హమ్మయ్య! గురువుగారు ఇప్పుడూ హాయిగా వున్నారు అనుకుని గురువుగారు విసిరేసిన ఆ జుత్తు(విగ్ లాంటిది సవరం) తెచ్చుకుంటే బావుండు. అది ఆయన ధరించినది. పైగా ఆయన చేత్తో టచ్ చేయపడ్డది. ఆయన తాకినదీ, చూసినదీ పవిత్రమైనది. ఎలా తెచ్చుకోను? ఆయన ఎదుట తెచ్చుకోవటం బావుండదు. సత్సంగం అయ్యాక వీళ్ళంతా గుంపుగా వెళ్ళి ఇది గురువుగారిదంటూ అందరూ ఎగబడి తీసేసుకొంటారేమో? ఇలా ఆలోచనచేస్తూ వున్నాను. గురువుగారు మటుకు దీర్ఘంగా ఆలోచిస్తూ సత్సంగం వింటూ అటూ ఇటూ తిరుగుతున్నారు. మళ్ళీ నాకు ఆలోచన మారిపోయి గురువుగారిని అడిగి పాదనమస్కారం చేసుకుంటే బాగుండు. గురువుగారు ఒంటరిగా వున్నారు కదా, హాయిగ, హడావుడి లేకుండా పాదనమస్కారం చేసుకోవచ్చు అని అనుకొంటూ గురువుగారి వంక చూస్తూ, నమస్కారం చేస్తూ మనస్సులో, గురువుగారు పాదనమస్కారం చేసుకోనాండీ? అని అడుగుతున్నాను. వెంటనే గురువుగారు ఆగి నావంక చూసి, ఆజ్ఞాపిస్తున్న విధంగా సత్సంగంవేపు చూపించి నన్ను వెళ్ళి అక్కడ కోర్చోమని కళ్ళతో సైగచేసి చెప్పారు. ఔను! గురువుగారు చెప్పినట్లు వినాలి కదా! అనుకుంటూ నేను సత్సంగం వైపు నడుస్తున్నాను. మెలుకువ వచ్చింది. టైం చూస్తే 4 గంటలు. నాకప్పుడు ఇలా అన్పించింది.

సాయిగారి సత్సంగం వెనుక గురువుగారున్నారు. నన్ను శ్రీసాయిగారు చేసే సత్సంగానికి వెళ్ళమని గురువుగారి ఆజ్ఞ. తప్పకుండా వెళ్తాను గురువుగారూ! అని దణ్ణం పెట్టుకున్నాను. అదేక్షణంలో మరి గురువుగారు ఏసుక్రీస్తుగా ఎందుకు కనిపించారు? ఏమో! అనుకున్నాను.

సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్రంవారి అష్టమ వార్షికోత్సవం(రామలింగేశ్వరపేట) నేనెప్పుడూ ఇంత విమర్శనాత్మకంగా చూడలేదు. గురువుగారి అనుగ్రహంతో 2 రోజులు భిక్ష కూడా చెయ్యగలిగాను. ఫంక్షన్‌లో శ్రీ సాయి మహారాజ్, శ్రీ గురు మహారాజ్ పురవీధులలో తిరుగుతూ, సాయినామం చేసేవారి యొక్క భంగిమలు తామూ తిలకిస్తూ బాబాతో ఫంక్షన్ హాలుకు వచ్చి సింహాసనాలలో ఆశీసునులయ్యారు. ఆనందంగా భజన జరుగుతున్నది. శ్రీ సాయిగారు భజన ఆపమని సైగ చేసారు. చర్చిలో వుండే ఫాదర్‌ని ఆహ్వానించారు స్టేజ్ మీదకు.(ఆయనగారి పేరు గుర్తులేదు నాకు) ఫాదర్ వచ్చి ఏసుక్రీస్తును గురించి చెపుతుంటే నాకెంత ఆశ్చర్యం కలిగిందో చెప్పలేను. ప్రతిసారి సాయి పూజోత్సవాలకి ఫాదర్‌ని ఆహ్వానించే అలవాటు వారికుందని శ్రీసాయిగారు చెప్పారు. కానీ నేను శ్రీసాయి ఉత్సవాలలో మొదటి నుంచి చివరిదాకా అస్సలెప్పుడు పాల్గొనలేదు కాబట్టి నాకావిషయం తెలీదు. నాకు తెలిసింది ఒక్కటే. ఈ నెల 6వ తేదీ రాత్రి గురువుగారు ఏసుక్రీస్తుగా కనిపించారు! ఎందుకు! అన్న సందేహానికి ఇప్పుడు శ్రీసాయిగారి ద్వారా 17-1-1999 ఫంక్షన్‌లో పాదర్ మాట్లాడడం, నాకు క్రీస్తు ముందుగానే దర్శనమివ్వటం, సకల దేవతా స్వరూపులు శ్రీ గురువుగారేనని ఆ విషయం నాకు స్వప్నం ద్వారానే కాకుండా ప్రత్యక్షంగా తెలియచేయడం నాకు దొరికిన జవాబు. ఇదంతా గురువుగారి సంకల్పం ప్రకారమే జరిగిందని భావిస్తున్నాను. ఫాదర్ చెప్పిన వాక్యాలలో అమూల్యమైన ఒక వాక్యం నాకెంతో నచ్చింది. సముద్రంలో స్నేహితులతో వెళ్తున్న క్రీస్తు, క్షణం కన్నులు మూయగానే సముద్రం అల్లకల్లోలం కావటం, స్నేహితులు భయపడి కేకలు వేయటం, అప్పుడు క్రీస్తు "అల్ప విశ్వాసుల్లారా" అని సంబోధిచడం నిజంగా చాలా బావుంది. మన గురు బంధువులందరికీ ఆ వాక్యం నచ్చి వుంటుందనుకుంటాను. విశ్వాసం బలంగా వుంటే దైవం రక్షణ కూడా బలంగానే వుంటుంది. బాగా పుచ్చిపోయిన యింట్లో ఈ రోజువరకూ మేముక్షేమంగా వుంటున్నామంటే, మాకు గురువుగారి మీదున్న విశ్వాసం, నమ్మకం అలాంటిది. గురువుగారి తెలియనిదంటూ ఏం లేదు కదా! అదే మా విశ్వాసం. మనలో వున్న విశ్వాసాన్ని బట్టే మన కోరికలు తీరటం, తీరకపోవటం జరుగుతుంది. ఆత్మ విమర్శన చేసుకుంటే పని కాలేదంటూ విమర్శించే పనేవుండదు ఎవరికైనా!



18-1-99 పి. వరలక్ష్మి - కొత్తపేట, తెనాలి.

## ఊహించని రీతిలో అనుగ్రహించిన గురూజి

నేను మొట్టమొదటిసారిగా పూజ్య గురూజీని తెనాలిలో 1993లో జరిగిన గురుపూజ మహోత్సవములో దర్శించుకున్నాను. ఆసమయములో గురూజీలో నున్నటువంటి అంతఃశక్తిని గుర్తించలేక మనస్ఫూర్తిగా పాదనమస్కారము కూడ చేసుకోలేకపోయాను. తర్వాత మా నాన్నగారి కోర్టు ఫైల్స్ unexpected గా miss అయినవి. మా అమ్మగారు గురూజీకి ఫైల్స్ గురించి ఫోన్ చేయటం, గురూజీ అనుగ్రహంతో మా నాన్నగారి ఫైల్స్ దొరకటం జరిగింది. అప్పటినుండి నాకు గురూజిని దర్శించుకోవాలి అనేటువంటి ఇంటరెస్ట్ కలిగినది. తర్వాత తిరువణ్ణామలైలో నేను డిగ్రీ రెండవ సంవత్సరము చదివేటప్పుడు షిర్డీలో గురూజీని దర్శించుకున్నాను. ఎప్పుడు నాకు గురూజీ నిర్ణయించిన విధముగా నా స్టడీస్ కంటిన్యూ చెయ్యాలి అనేటువంటి కోరిక ఉండేది. నేను షిర్డీ వెళ్ళినప్పుడు గురూజీ దగ్గర నా కోరిక విన్నవించుకున్నాను. గురూజీ "తర్వాత చెప్తాను, ఇంకా టైం ఉన్నది కదా" అనేవారు. తర్వాత ఆఖరి సంవత్సరం పూర్తి అయినాక మరలా షిర్డీ వెళ్ళాను. అప్పుడు గురూజీ దగ్గర మా అమ్మగారు పాప B.Ed చేస్తానని కోచింగ్‌కు వెళ్తుంది అని చెప్పారు. గురూజీ నా Interestని గమనించి B.Ed. చేయటానికి అనుమతించారు. నేను మామూలుగానే ప్రిపేర్ అయి పరీక్ష వ్రాసాను. నేను వ్రాసినటువంటి పరీక్షకు 2000 లేదా 3000 ర్యాంక్ వస్తుంది అని అనుకున్నాను. కానీ నన్ను గురూజీ ఊహించని విధముగా 147వ ర్యాంక్ వచ్చే విధముగా అనుగ్రహించారు. ఈ విధముగా నాకు గురూజీ అనుగ్రహముతో 147వ ర్యాంక్ వచ్చినది. మనలో నున్న అహంకారము వలన ఎదుటనున్న దైవాన్ని గుర్తించలేము. బాబా మనకు ప్రసాదించిన ఆణిముత్యము గురూజీ. ఈ రోజు మనము బాబాని భౌతికముగా దర్శించుకోలేకపోతున్నాము అనే బాధను గురూజీ సమక్షములో

మరచిపోవచ్చు. ఎల్లవేళలా గురూజీ అనుగ్రహము మన అందరి మీద ప్రసరించాలని బాబాని మనసారా వేడుకుందాము.

10-5-99 జి.భార్గవి - చినరావూరు

## "బాబా చేతి ఊది - గురూజీ నోటి మాట"

నెల్లూరు సత్సంగ సదస్యులు శ్రీ లక్ష్మి నారాయణగారి అనుభవాన్ని మా గురుకృప పత్రికకు A.R.R.మోహనరావుగారు వ్రాసి పంపిన ఉత్తర సారాంశమిది.

1998 జూలై 12 శనివారం సా||గం||6.15ని||లకు శ్రీ పెళ్ళకూరు లక్ష్మి నారాయణరెడ్డి గారికి కారు యాక్సిడెంట్ జరిగినది. (శ్రీ లక్ష్మి నారాయణరెడ్డిగారు, శ్రీ మహేష్ నాయుడుగారు మన సత్సంగ సభ్యులుగా ఉంటూ నెల్లూరు బైపాస్ రోడ్ లోని సాయిబాబా మందిరమునందు Garden Development & Maintenance పనిలో చాలా సేవ చేస్తూ యున్నారు.)

యాక్సిడెంట్‌లో ఊపిరితిత్తులకు బాగా దెబ్బతగిలి శ్రీ Dr. Mallikarjuna Rao, Chest Specialist దగ్గర ట్రీట్ మెంట్ తీసుకున్నారు. Chest problem తగ్గినది గాని నడుము, వెన్నుపూస కలిసేచోటు నొప్పి తగ్గలేదు. 1998 విజయదశమికి షిర్డీకి వచ్చి గురువుగారికి విషయము చెప్పి వారి ఆశీస్సులు ఊది ప్రసాదము తీసుకుని వచ్చినారు. అప్పటినుండి ఆ నొప్పి పూర్తిగా తగ్గిపోయినది. తరువాత మందులు ఏమి వాడలేదు. మరల ఆ నొప్పి ఫిబ్రవరి 1999 ఆఖరులో కనిపించినది. నొప్పి కొద్దిగా ఉన్నందువలన దానిని లెక్కచేయకుండా మామూలుగా తన పనులు చేసుకొనుచుండినారు.

1999 ఏప్రియల్ 2వ తేది నొప్పి విపరీతమై మంచములో నుండి లేవలేకపోయినాడు. అప్పుడు అతని మిత్రులు శ్రీ మహేష్ నాయుడు గురువుగారికి అతని నొప్పిని గురించి చెప్పుకుని మన బాబా సత్సంగ మందిరములోని ఊదిని తీసుకునివెళ్ళి నడుమునకు, వెన్నుముకకు పూర్తిగా రాసినాడు. ఇది రాత్రి గం||8.15లకు చేసినారు. ఊది రాసిన వెంటనే శ్రీ లక్ష్మినారాయణగారు హాయిగా నిద్రపోయినారు. రాత్రి గం||2.00కు మూత్ర విసర్జనకు లేచినపుడు నొప్పి ఏమాత్రం లేదు. ఆరోజు నుండి ఈ రోజు వరకు నొప్పిలేదు. ఇది గురువుగారి అనుగ్రహము. బాబా ఊది మహిమ గాక మరేమిటి. ఇది లక్ష్మినారాయణగారు నాకు చెప్పగా నేను వ్రాసి పంపుతున్నాను.

13-4-99 P.లక్ష్మినారాయణ - నెల్లూరు.

## సద్గురు అనుగ్రహంతో - సత్సంగ మందిరము

సాయిసాధన స్వరూపులు శ్రీ సాయినాథుని శరద్బాబూజీగారి దివ్యాశీస్సులతో 1998 ఫిబ్రవరి 19వ తేదీన నెల్లూరులో జేమ్స్ గార్డెన్ బైపాస్ రోడ్ వద్ద బాబా మందిరంలో సత్సంగము ఏర్పాటు చేసికొనినాము. గురుమహిమ అపారము, అనంతము, ఇంతింతని చెప్పలేనిది. దినదినాభివృద్ధి చెందుచున్నది. మామూలు రోజులలో 120 నుండి 150 మందిదాకా సత్సంగ భజన కార్యక్రమములకు హాజరగుచున్నారు. ఆదివారము రోజున 300 మంది వస్తున్నారు. మేము ఒక్కరిని చెయ్యిచాచి డబ్బులు అడుగలేదు. ఎవరికి వారే ముందుకువచ్చి ఒకరు రేకులు వేయిస్తే ఒకరు నేలకు బండలు పరిపించారు. ఒకరు మోటారు పైప్‌లను వేయిస్తే ఒకరు బోరింగ్ వేయించారు మరొకరు కరెంట్ తెప్పించారు. ఇలా మేము 1999 ఫిబ్రవరి 18వ తేదీన ప్రథమ వార్షికోత్సవము జరుపుకొను

నాటికి మందిరము సర్వాంగసుందరముగా తయారయినది. ఇంత అనతి కాలంలో ఇంత గొప్ప అభివృద్ధిని సాధించిన ఘనత నెల్లూరు సత్సంగ సభ్యులది కానే కాదు. ఇది గురుకృపయే. వారి ఆశీస్సులే లేకుండా వారు ఎవరెవరి మనస్సులో జొరబడి ఇంతటి కార్యాన్ని చేయించారో మన గురుబంధువులందరికీ ఎరుకే. అనుకున్న క్షణంలో ఎవరో ఒకరు వచ్చి మేము చెప్పకుండానే "మేమీ కార్యం చేయించదలిచాము మీరేమంటారు" అని మమ్మల్ని అడగడం ఆశ్చర్యం కాదా! అది గురువుగారి అనుగ్రహం కాదా!

మా సత్సంగ సభ్యులందరము సద్గురు సాయినాథుని శరత్‌బాబూజీగారికి ఋణపడివున్నాము. వారికి నమస్కారములు తెలియజేసుకుంటున్నాము.

7-4-99 A.R.R. మోహనరావు - నెల్లూరు.

## ఆచేయి ఎంత హాయి (భాగము -5)

"బాబా ఉంటే చాలు వేరేల ముక్తి మోక్షాలు"

............"బిచ్చమేసే మహారాజు "బాబా" యే అయినప్పుడు ఆయన ముందు జోలె తగిలించుకుని భిక్షాపాత్రను చేతపట్టుకోటానికి సిగ్గుపడాల్సిన పనేలేదు. ఆయన ముందు నేను బిచ్చగాడినే. ఆయన వేసింది ఏదైనా నాకిష్టమే. ఆయన(బాబా) తిని రాల్చిన ఎంగిలి మెతుకైనా నాకు పెన్నిధితో సమానమే".......... అన్న మాటలు గురుదేవులు సముద్రమంత గంభీరంగాను, ఆకాశమంత శాంతంగాను, మేఘజలమంత నిర్మలంగాను అనేసరికి నా వళ్ళు అణువణువునా పులకరించింది. పరవశించింది. రోమాంచితమైంది. తెలియకుండానే కళ్ళవెంట ఆనందభాష్పాలు రాలినవి. ఎందుకు? కారణం తెలుసా! అంటే తెలియదు.

"శరద్బాబూజీ" మహోన్నతమైన స్థాయిలో, ఆధ్యాత్మికతయనే మధుర వృక్షానికి పండిన మధురాతి మధురఫలం. ఎందరో హృదయాలలో వారి రూపాన్ని పదిలంగా భద్రపరుచుకున్నారు. దైవంలా ఆరాధిస్తున్నారు అలాంటి మహానుభావుడు, మహోన్నతుడు, మహమహోపాధ్యాయుడు, శరద్బాబుగారు, అలాంటి మాననీయుడు ఆర్తిగా, ఆనందంగా "బాబా" ముందు నేను బిచ్చగాడినే నను మాటలు నాభినుంచి వచ్చినవేగాని, నాల్కకొసనుంచి వచ్చినవి కావు.

నాకు గత సన్నివేశాలు కొన్ని గుర్తుకు వచ్చాయి. గురుదేవులు "బాబా" ముందు మోకరిల్లే విధానము, నమస్కరించే తీరు, సాష్టాంగపడు విధానము, "బాబా" వంక చూచే విధాయకము, గమనిస్తే పరాకాష్ఠకు చెందిన భక్త శిఖామణులైన కబీరు, తుకారం, జ్ఞానదేవులు మొ|| వారంతా జ్ఞప్తికి రాకమానరు. దాస,దాస,దాస,దాసాను దాసులమనే వైష్ణవస్వాములు, ఆళ్వార్లు గుర్తుకు వస్తారు.

నేను "వేంకటగిరి" ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రోపన్యాసకునిగా పనిచేస్తున్న రోజుల్లో పాఠ్యాంశంలో

"నీ పాదకమల సేవయు,
నీ పాదార్చకుల తోడి నెయ్యమును, నితాం
తాపర భూత దయయును
దాపస మందార నాకు దయసేయగదే"

*భాగ - 10 - 1268*

ఈ పద్యానికి అర్థం చెప్పి, భావాన్ని విశదపరిచినాను. నాకెందుకో తృప్తి కల్గలేదు. అసంపూర్ణమైన భావమే నానుండి వచ్చిందా? అని అనిపించింది. మధురానగరాన్ని చూడవచ్చిన బలరామకృష్ణులు మాలాకారుడైన సుదాముని ఇంటికెళ్ళినారు. తన ఆరాధ్యదైవమైన శ్రీకృష్ణుడు తనింటికి వచ్చినాడని సుదాముడు పరవశించి మాలాకైంకర్యము చేస్తాడు. అందుకు మెచ్చి కృష్ణుడు సుదాముని వరము కోరుకోమనగా 1. నీపాదసేవ 2. నీ పాదములను సేవించు వారితో స్నేహము 3. భూతదయయును ప్రసాదించమనినాడు.

ఈ సందర్భంగా నాకు కల్గిన అనుమానమేమంటే దైవము సాక్షాత్కరించినప్పుడు, అనంతైశ్వర్యమునో త్రిలోకాధిపత్యమో, లేదంటే మోక్షమునో కోరుకుంటారుగాని పాదసేవ, పాదసేవ చేయువారితో స్నేహము ఇత్యాదులు కోరుతారా! అనే శంక చాలా కాలమువరకు నన్ను వెన్నంటింది. ఎందుకంటే ప్రతివాడు తరచుగా భగవత్సాక్షాత్కారము లభించినప్పుడు ముక్తి, మోక్షాదులనే అడుగుతారు గదా! ఈ అనుమానం అనుమానంగానే ఉంది. ఎవ్వరినీ అడగలేదు

షిరిడీలో ఒక రోజు మన గురువుగారు వారి ముందుకొందరు బాబా భక్తులు కూర్చొని ఉన్నారు. వారి సందేహాల మాటలను గురువుగారి ముందు విప్పారు. "బాబా"కు సంబంధించిన విషయాలు గురువుగారు చెప్పేటప్పుడు చూడాలి. ఉత్సాహం, ఉత్తేజం, ముప్పేటలుగా పెనవేసుకుని ఉంటాయి. మోక్షం విషయంగా సాగుతోంది విషయం.

భక్తుడు : బాబా మోక్షాన్ని గురించి ఏం చెప్పారు?

గురువుగారు : మోక్షము - ముక్తి మొ|| మాటలను బాబా ఎన్నడు అనలేదు. మసీదులో వారెన్నడూ ఆధ్యాత్మికమైన, ఉపన్యాసములు చెప్పలేదు. వేదాంతవిషయాలు, సుదీర్ఘప్రసంగాలు, ఆత్మ, జీవాత్మ, పరమాత్మ వంటి మాటలను వేదాంత విషయాలుగా బాబా చెప్పి ఉండలేదు.

భక్తుడు : మరేం చెప్పారు.

గురువుగారు : "బాబాలీలలను" పరిశీలించండి. మీకు స్పష్టంగా అర్థం కాగలదు. "బాబా" ఎక్కువగా మాటలు చెప్పేవారు కాదు. పది మాటలు మాట్లాడితే ఒక మాటకు సమాధానం చెప్పేవారు. ఎవ్వరితోను అధికంగా మాట్లాడలేదు. వేదాంత పరిభాషగా "బాబా" చెప్పలేదు. భగవన్నామ ముచ్చరించు, సద్గ్రంధాలు చదువు, పనిచేయి,గురువుకు పగ్గాలప్పగించు, చింతకు తావేలేదు, నా పై భారమేయుడు. మిమ్ములను చివరికంటా గమ్యం చేరుస్తాను. ఇలాంటివి. బాబా ఎన్నడూ ముక్కు మూసుకుని తపస్సు చెయ్యమని గాని, భార్యాపుత్రులు బంధాలు అనిగాని అనలేదు. అన్నీ వాడే చేస్తే ఇక భగవంతుడు చేసేది ఏంటట? ఉపాసనీ బాబా శిరిడీకి వచ్చాడు. రొట్టె, కూరముక్కలు తింటూ, హాయిగా ఖండోబా ఆలయంలో ఉండమన్నారే గాని నీవు జపతపాలను చేయమని బాబా ఎన్నడూ అనలేదు. ఆయన మీద భారము వేయగల్గటమే మనం చేయవలసింది. మనలను నిశ్చింతగా ఉండమనినారు. గమ్యాన్ని నేను చేరుస్తాననే బాబా చెప్పారు. ఇతర దేవతా మూర్తులకు బాబాకు ఇక్కడే వ్యత్యాసం కనిపిస్తుంది. అన్ని బంధాలు తెంచుకుని నిరంతరం నన్నే స్మరిస్తూ ఉంటే నీ యోగక్షేమాదులను నేను వహిస్తానని భగవద్గీత చెబుతుంది. బాబా భక్తుడు చేయవల్సిందేమీలేదు. బాబా మనకోసంగా చేసేది అనంతము. ఆనందముగా జీవించాలి.

నాకు ముక్తి వద్దు, మోక్షము వద్దు.

నా ప్రశ్న : సర్వసాధారణంగా అందరు ముక్తి, మోక్షము కావాలని అంటారుగదండి!

గురువుగారు : వాళ్ళకు అది అవసరమేమో, తెలియదు. ఎందుకు అవసరమో తెలియదు. నాకైతే దాంతో పనేలేదు. నాకు జన్మజన్మలకు "బాబా"తో అనుబంధముండాలి. ఆయన సన్నిధి కావాలి. ఆయన సేవకావాలి. ఆయన రూపం నిరంతరం నా ఎదుట కన్పించాలి. ఆయన కోసంగా నా జీవితం గడవాలి. ఆయన పాదాలను నా ఎడమచేత్తో పట్టుకుని ఈ ప్రపంచానికి సంబంధించిన నా పనులను కుడిచేత్తో చేసుకుంటాను.

బాబా కన్పించని జీవితమెందుకండి. నిరంతరం నాకు బాబా కావాలి. బాబాతో అనుబంధముండాలి. బాబాను చూస్తుండగా కలిగే ఆనందం ముక్తి, మోక్షాలలో ఉంటుందా? బాబా కన్పించని ముక్తి, మోక్షాలు నాకు నిజంగా అక్కరలేదు. ఆయన రూపం- ఆయన సన్నిధి నాకు నరకంలో లభించినా, నరకానికి వెళ్ళటానికి గూడా అభ్యంతరం లేదు. ఎంతటి కష్టాన్నైనా "బాబా"ను చూస్తూ ఆనందంగా అనుభవిస్తాను. ఆయన సేవ నాకు ముఖ్యం. ఎన్ని జన్మలున్నాయో నాకు తెలియదు. "బాబా"తో అనుబంధముండాలి. బాబాను చూడాలి. ఆనందాన్ని ప్రతి జన్మలో అనుభవించాలి. మోక్షం వలన జన్మ లభిస్తుందా? బాబా సేవ లభిస్తుందా? "బాబా" సేవ లభించని మోక్షస్థితి అటువంటి జన్మ నాకువద్దు అన్న మాటలు నాకు సమన్వయమైనవి నా పద్యానికి.

నిజమేగదా! నిరంతరం తన ఆరాధ్య దైవానికి ఎదురెదురుగా సంచరిస్తూ, ఆయన సన్నిధిలో నివసిస్తు ఆయన పాదసేవను గావిస్తూ, ఆయనను గురించిన లీలలను వినాలంటే ఆయన సేవకులేగదా! వారి గుణగణాలను గానం చేయగల్గినది. గురుదేవా! వందనమయ్యా! "బాబా"పై మీకున్న ప్రేమ అపారము. అనంతము. నరకంలో గూడా ఆయనరూపం ఉంటే ఎలాంటి కష్టాన్నైనా అనుభవిస్తాననే మాటలు వినేసరికి ఒడలు జలదరించాయి.

గురువుగారి భక్తి, ప్రేమ, శ్రద్ధ, శరణాగతి సామాన్యమైనవి కావు. అలాంటివారి పాదాలను తాకినాచాలు. ఎన్నో జీవితాలు ఆనందదాయకమవుతాయనిపించింది. పూర్వం "కుక్కుటముని" అనువారున్నారు. సకల పాపాలను పోగొట్టగల గంగా, కావేరీలు తమ పాపాలను ప్రక్షాళనం చేసుకోవటానికి ఆ కుక్కుట మునీశ్వరుని సన్నిధికి వచ్చి, ఆ మహనీయుని పాదజలాన్ని తమతమ శిరములపై చల్లుకున్నంత మాత్రాన వారి పాపాలు తొలగి మలిన దేహమంతరించి పోయేది. ఆ కుక్కుట మునీశ్వరునకు అంతటి మహిమ ఎక్కడిది? తన గురువును శ్రద్ధా, సబూరీలతో సేవించి, శరణాగతి చెంది ఉండటమే కారణం. బాబా గూడా ఒకానొక సందర్భములో "నా ఈ స్థితికి మూలము నా గురువే" అని చెప్పినారు. తన గురువును బాబా ఎలా సేవించినది చెప్పి ఉన్నారు. ఈనాడు అలా "బాబాను" మన గురువుగారు సేవిస్తున్నారనిపించింది. మరో సందర్భములో తిరువణ్ణామలైలో వారితోనే అని ఉన్నాను.

సార్ ఈనాడు "బాబా" ఒకప్పుడు వారిచ్చిన స్టేట్ మెంటు మార్చుకోవాలేమోననిపిస్తుంది అని అన్నాను.

ఏమిటా స్టేట్ మెంట్ అని అడిగారు.

"ఉద్వేగతను, వాస్తవమును వివరించు అంశమును, వారు వినిపించిన భాగవతోత్తముల కథలను అవధరించుటకై వచ్చే సంచికలో చూడగలము"

డా|| జి. సాయివరప్రసాదరావు - రేపల్లె.

# శరణాగతి సులభమా? కష్టమా?

శ్రీ 'యస్వీయల్' నారాయణరావు

సాయిపథం నవంబరు-జనవరి 1994

*(గురుకృప ప్రారంభ సంచిక నుండి శ్రీ S.V.L. గార్ని వ్యాసంకై కోరుతోంది. వ్యవధి దొరకని వారిని వేధించటం ఇష్టంలేక మౌనం వహించిన వైనములో ది. 22-5-99న బుర్రిపాలెంలో జరిగిన సత్సంగములో పాల్గొన్న మాకు యాదృచ్ఛికంగా బాబా ప్రసాదంగా లభించినదే ఈ ఆర్టికల్. అంతేగాక శరణాగతి పొందటానికి మనకు లోపించిన వివేకం గురించిన గురూజీ సమాధానం ప్రతివారికీ ఒక బోధే)*

ఈ ప్రశ్ననే ఒకరోజు సత్సంగంలో గురువుగారు శ్రీ సాయినాథుని శరత్‌బాబూజీని అడిగాం. కొంచెం ఆలోచిస్తే మీకే ఈ విషయం బాగా బోధపడుతుంది! శరణాగతి మనకు క్రొత్తదేం కాదు. ఎప్పుడూ ఏదో ఒక కోరికకు దాన్ని సాధించే మార్గాలకు మన భద్రతా భావాలకు శరణు పొందుతూనే ఉన్నాము. వాటికి దాసోహమవుతూనే ఉన్నాము. మనకు ప్రమోషన్ రావాలనుకోండి దానికి సంబంధించిన అధికారి వద్దకు వెళ్ళి దాసోహమని శరణు వేడుతాం. నిజానికి మనం శరణు వేడింది అధికారికా? కాదు, మన ప్రమోషన్‌కి. అలా మనం మన కోరికలకు ఎప్పుడూ శరణు జొచ్చుతాం. ఆ కోరికలు తీర్చమని బాబాను ప్రార్థిస్తాం. అలా ప్రార్థిస్తూ బాబాకు శరణు పొందామనుకుంటాం. నిజానికి మనం శరణు పొందింది బాబాకా? కాదు మన కోరికలకు. మనకు మన కోరికలు తీరటం ఇష్టం. ఆ కోరికలు బాబా ద్వారా తీరుతాయి. కాబట్టి మనకు బాబా ఇష్టం అనుకుంటాం. నిజానికి మనకు బాబా అంటే ఇష్టం కాదు. మనం బాబాను బాబాగా ప్రేమించలేం. మనం ప్రేమించేది మన కోరికలనే. మన కోరికలు తీర్చటం ద్వారా మాత్రమే మనం బాబాను ప్రేమిస్తున్నామనుకొంటాం.

మనం సాధారణంగా ఈ కోరిక తీరితేచాలు, నాకింకేం ప్రాబ్లమ్స్ లేవు అని అంటాం. బాబా అది తీర్చితే ఇంకొకటి తెచ్చి పెట్టుకుంటాం. నిజానికి మనం ప్రాబ్లమ్స్ లేకపోతే బ్రతకలేము. కాబట్టి మనం ఒకటి పోతే ఒకటి తయారు చేసుకుంటాం. ఇల్లు కట్టుకోవటమో, పైన ఇంకొక అంతస్తు వేయటమో లేక వ్యాపారం ప్రారంభించడమో, లేక పెంపొందించడమో, ఏదో ఒకటి. మన ప్రేమ మనం సృష్టించుకున్న సమస్యలపైనే కానీ నిజానికి బాబా పట్ల కాదు! ఇది తప్పని నేను అనను. అది అందరికి సహజం. అయితే, మన కోరికలు అవితీరే మార్గాలపట్ల మన అవగాహన, బాబాను బాబాగా ప్రేమించగలగడం మొదలైన అంశాలను గూర్చి ఇలా నిశితంగా ఆలోచించండి. దానివలన సాధన, శరణాగతి, గమ్యం మొదలైన వాటి గురించి ఎన్నో లోతైన అంశాలు మనకు అర్థమవుతాయి." అన్నారు గురూజీ.

ఇదే నిజమనిపిస్తుంది నాకు. ఎందుకంటే ప్రతి చిన్న కష్టం గురూజీతో చెప్పి తీర్చుకుంటుంటాం, ఆఖరుకు తలనొప్పి, జలుబు దగ్గర నుండి. కానీ గురువుగారికి ఒంట్లో బాగోలేదు. జ్వరంగా ఉంది. జ్వరం 105,106 డిగ్రీలు ఉంది అని విన్నా, ఎందుకో గురువుగారిని చూడాలనిపించదు. వెంటనే బయలుదేరి వెళ్ళాలని తోచదు. ఒకవేళ ఫోనులో మాట్లాడినా వారి ఆరోగ్యం అడగటం మర్చిపోయి నా సమస్యలే చెప్పి విసిగిస్తుంటాను. గురువుగారేమో ఎప్పుడు వెళ్ళినా ప్రేమగా పలకరించి ఆరోగ్యాన్ని గూర్చి వివరాలు తెలుసుకొని ఇంతకు ముందు వచ్చి తగ్గిపోయిన అనారోగ్యాన్ని గూర్చి కూడా అడుగుతారు. నిజానికి ఆ జబ్బు గూర్చి తగ్గగానే మనమే మర్చిపోతుంటాం. కాని గురువుగారు మాత్రం ఆరునెలల తరువాత కలిసినా ఆ జబ్బుగూర్చి గుర్తుగా అడుగుతారు. కాని అదేం కర్మో గురువుగారికి బాగోలేదని తెలిసిన తరువాత మూడురోజులకు వెళ్ళినా ఆ విషయం అడగాలన్న ధ్యాసే వుండదు.

గురువుగారు చెప్పిన పై విషయాలు విన్న తరువాత నాకు అసలు రహస్యం అర్థమైంది. జ్ఞానోదయమైనంత ఆనందం కలిగింది. ఎందుకంటే ఇది ఒక్క గురువుగారు, బాబా విషయంలోనే కాదు, నిజానికి మనం అనుక్షణం మన కోరికల్ని మనం ప్రేమించుకుంటామే కాని నిజానికి ఎవ్వరినీ మనం ప్రేమించం అంతా బూటకమే. అందుకే మనకు ఆనందం లేదు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్టు ఏదో వెలితిగా వుంటాం.

ఇది పోవాలంటే ముందు మనం ఎదుటి వ్యక్తిని ప్రేమించాలి. ఎదుటి వారి కోర్కెలు తీర్చడానికి ప్రయత్నించాలి. వాటికోసమే పాటుపడాలి. అప్పుడుగాని మనం బాబాను ప్రేమించలేము. గురువును ప్రేమించలేము. అప్పుడే నిజమైన ప్రేమతత్త్వం మనకు వంటబట్టేది.

అంతా అర్థమైనట్టే వున్నది కానీ, ఆచరణే సాధ్యం కావటం లేదు. అంతా బాబా దయ. గురువుగారే చూచుకుంటారని నన్ను నేను ఓదార్చుకుంటాను.

## సాయిపథం వారి బాట - విద్యాపథం వారి మనోభావానికి ఒక విత్తు

ఆ ఆలోచనలతో వారు నాటిన ఆ విత్తు నేడు మహావృక్షం అయి, తన పదహారో వార్షికోత్సవాన్ని సర్వాంగ సుందరంగా జరుపుకొనటం ఆ స్కూల్‌కి లభించిన గురు అనుగ్రహానికి నిదర్శనంగా పేర్కొన వచ్చును.

ఈ వ్యాసానికి ముందు నేను ఒక ఉదాహరణ ఇవ్వటానికి సాహసిస్తున్నాను.

నేను చదివిన "భారాగో" కథలలో నాలాంటి ఒక రిపోర్టర్ గురించిన కథ. ఒక ఆఫీసులో ఫంక్షన్ జరుగుతుంది. ప్రతిసారి లాగానే ఈసారి కూడా వార్తలు పంపే అధికారి పేపరుకు న్యూస్ ఇస్తాడు. ఆ న్యూస్ సారాంశం మొత్తం పేర్లతోనే నిండి ఉంటుంది. ఆ న్యూస్ చదివిన పై అధికారి వెంటనే అతనిని పిలిచి అసలు జరిగిన కార్యక్రమం గురించి ఏమీ లేకుండా ఉత్త పేర్లతోనే సరిపెట్టినందుకు చడామడా తిట్టి పంపుతాడు. ఇంతకు ముందు అధికార్లు అందరూ పేర్లు మాత్రమే న్యూస్‌గా చదవటం అలవాటు పడినవారు. నేడు వార్తల సారాంశము కూడా ఇలాగే ఉంటోంది.

ఆనాటి వార్షికోత్సవములో ముఖ్యంగా నాకు నచ్చిన శ్రీ బి.చంద్రకుమార్ గారి ప్రసంగములో వారు ఆనాటి కార్యక్రమము, దాని ప్రత్యేకత గురించి, అచ్చట చేరిన తల్లిదండ్రులకు పిల్లల పెంపకం గురించి చెబుతూ ముఖ్యంగా ఇంటిలో పిల్లల ఎదుట పెద్దల ప్రవర్తన వారి నడవడికలపైనే పిల్లల మానసిక ఎదుగుదల ఆధారపడి ఉంటుంది అని చెబుతూ తల్లిదండ్రులుగా మన నడవడిక ఎలా ఉండలి అంటూ మన నడవడికనే పిల్లలు అనుసరిస్తారు కాబట్టి ప్రతి తల్లిదండ్రి శ్రద్ధ, సబూరీలతో సత్ప్రవర్తన కలిగి ఉండి తాము నడుస్తుంటే దానిని చూసిన పిల్లలు కూడా అదే బాటలో పయనిస్తారు అని అనేక ఉదాహరణలతో చెప్పినారు. శ్రీ సాయినాథుని శరత్ బాబూజీగారి ఆశయం + ఆధ్యాత్మిక చింతనలతో మన మందరము నడిస్తే రేపటి బాలలు ఎలా ఉంటారో విశదీకరించినారు. (స్థలాభావంచేత వారి పూర్తి ప్రసంగాన్ని సంక్షిప్తంగా ఇవ్వటం అయినది)

ఆనాటి కార్యక్రమాలలో సుమారు 100 మంది పిల్లలు వివిధ రూపకాలలో పాల్గొని వచ్చిన ఆహూతులందరిని అలరింపచేసినారు. సాయంత్రం 7 గం||కు ప్రారంభమైన ఆ కార్యక్రమాలు రాత్రి 12 గం|| దాటినాకూడా ఒక్కరు లేచి వెళ్ళలేదు. చివరి కార్యక్రమం అయిన భాంగ్రా డాన్స్‌ను మరల రెండవసారి వేయమన్నారు. అంటే వారి ఓపిక, కార్యక్రమాలు రంజింపచేసిన విషయం అర్థం అవుతుంది. ఇందుకు ముఖ్యంగా సాయిబాబా మిషన్ సెంట్రల్ స్కూల్ వార్షికోత్సవ నిర్వహణలో స్కూల్ కమిటివారు మరియు టీచర్స్ చూపిన శ్రద్ధ,

సబూరి సిదర్శనం ఇస్ని కార్యక్రమాలకు L.K.G. పిల్లలనుండి 7th క్లాసు పిల్లల వరకు తరిఫీద్ ఇవ్వటానికి కనీసం నెలరోజులు శ్రమపడి ఉంటారు అని భాపించ వచ్చును. ఈ కార్యక్రమాలలో ప్రత్యేక ఆకర్షణగా బుర్రకథం ఎందరినో అలరించింది. స్కూల్ చరిత్రను కడు రమ్యంగా ప్రదర్శించిన ఆ చిన్న బాలురు వృత్తి కళాకారులనే ఆశ్చర్యంలో ముంచెత్తారు. 1st క్లాసు 2nd క్లాసు పిల్లచేత "Couples of India" ప్రదర్శింపజేసారు. పిపిధ రాష్ట్రాల సాంప్రదాయ డ్రస్సులలో జంటలు జంటలుగా వచ్చి వారి డ్రస్సుకు తగ్గ భావాన్ని ప్రదర్శించిన చిన్నారులు అభినందనీయులు.

ఈ కార్యక్రమములో కొసమెరుపుగా చిరంజీపి శృతి నృత్య కార్యక్రమాలలో పాల్గొనటం వన్నెతెచ్చినది.

గురువుగారి ఆశీర్వాదం పుష్కలంగా లభిస్తున్న ఈ స్కూల్ పిద్యార్థినీ పిద్యార్థులకు వారు గెలుపొందిన పిపిధ ప్రైజులను అమ్మగారు శ్రీ అనసూయమ్మగారి ద్వారా అందుకొనడం వారి అదృష్టంగా భాపించారు.

ఒంగోలు, 12-4-99 (సేకరణ : గురుకృప)

